ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 177 | పేజీలు: 5 | వెల: రూ.3/- | మంగళవారం 7 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## బీసీ రిజర్వేషన్ల జీవో
# రిట్ పిటిషన్ తిరస్కరణ

**హైకోర్టు స్టే ఇవ్వలేదని ఇక్కడికి వస్తే ఎలా?**

**వాదనలు అవసరం లేకుండానే డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు**

**హైకోర్టుకే వెళ్లి ఉండాల్సిందన్న ధర్మాసనం**



న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ సెప్టెంబరు 26న తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన జీవో నం.9ని కొట్టేయాలని కోరుతూ వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టికల్ 32కింద సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను కొట్టేయడంతోపాటు తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్-2018లోని సెక్షన్ 285ఏ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఇదే అంశంపై హైకోర్టులో దాఖలైన రెండు కేసుల్లో స్టే ఇవ్వలేదన్న కారణంతో ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని తప్పుబట్టింది. విచారణ ప్రారంభమైన వెంటనే ప్రతివాదుల తరపున సీనియర్ న్యాయవాది ఏడీఎన్‌రావు మాట్లాడుతూ ఇదే ..మిగతా 2లో



## బీహార్‌లో మోగిన
# ఎన్నికల నగారా

**రెండు దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు**

**నవంబర్ 14న ఓట్ల లెక్కింపు**

**నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు**

**14 లక్షల కొత్త ఓటర్లు సహా 7.43 కోట్ల ఓటర్లు ఉన్నట్లు వెల్లడి**

**తుది జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చామన్న ఈసీ**

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయని, నవంబర్ 14న ఫలితాలు ప్రకటిస్తామని భారత ఎన్నికల కమిషన్ సోమవారం తెలిపింది. కేంద్ర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియాకు పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను వెల్లడించారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. ఈ ..మిగతా 2లో

## నవంబర్ 11న జూబ్లీహిల్స్
# ఉపఎన్నిక




**14న ఫలితాలు**

**జూబ్లీహిల్స్ సహా పలు రాష్ట్రాల్లోని ఉపఎన్నికలకు షెడ్యూల్ విడుదల**

**13న ఉపఎన్నిక నోటిఫికేషన్, 21 వరకు నామినేషన్ గడువు**

**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,92,669 ఓటర్లు**

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. తెలంగాణతో సహా వివిధ రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 13న ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 వరకు గడువు ఉంది. నామినేషన్ల పరిశీలన ఈ నెల 22న చేపట్టనుండగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు అక్టోబర్ 24. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. తెలంగాణతో పాటు జమ్ము కశ్మీర్, ఒడిశా, ఝార్ఖండ్, మిజోరాం, పంజాబ్, రాజస్థాన్ లో కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలు, ఫలితాలు ఒకే రోజు వెలువడనున్నాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు.

# సీజేఐ గవాయ్‌పై దాడి

**సుప్రీం కోర్టులో షాకింగ్ ఘటన**

**సీజేఐపై షూ విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాది**

**అడ్డుకుని బయటకు లాక్కెళ్లిన సహచర న్యాయవాదులు, భద్రతా సిబ్బంది**

**నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ఇలాంటి ఘటనలు భయపెట్టలేవన్న జస్టిస్ గవాయ్**





న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో సంచలన ఘటన చోటుచేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడికి యత్నించాడు. ఓ కేసు విచారణ జరుగుతుండగా సీజేఐ జస్టిస్ గవాయ్ పైకి తన షూ విసిరేందుకు ప్రయత్నించాడు. నిందితుడి ప్రయత్నాన్ని సహచర నాకయవాదులు అడ్డుకున్నారు. అతడిని కోర్టు హాల్ బయటకు లాక్కెళ్లారు. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాక్షాత్తూ అత్యున్నత న్యాయస్థానంలోనే జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. ప్రధాన న్యాయమూర్తి ఓ కేసు విచారిస్తుండగా ఓ న్యాయవాది డయాస్ వద్దకు వెళ్లి తన షూ తీసి జస్టిస్ గవాయ్ పైకి విసిరేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఆ న్యాయవాదిని అడ్డుకున్నారు. ఇతర న్యాయవాదులతో కలిసి అతడిని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సనాతన ధర్మాన్ని సీజేఐ అవమానించాడని సదరు న్యాయవాది నినాదాలు చేశాడు. ఇలాంటి వాటికి తాను భయపడనని పేర్కొన్న సీజేఐ జస్టిస్ గవాయ్... తర్వాత యథావిధిగా విచారణను కొనసాగించారు.

### గవాయ్‌పై దాడి ఘటన...
## తీవ్రంగా ఖండించిన మోదీ

**సంయమనం పాటించిన సీజేఐని ప్రశంసించిన ప్రధాని**


**దుశ్చర్యపై సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం**



## వైద్య శాస్త్రంలో
## ముగ్గురిని వరించిన నోబెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. వైద్య విభాగంతో ప్రారంభమైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి. మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకు గాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ..మిగతా 2లో




## ఖర్గేను పరామర్శించిన రేవంత్

**అస్వస్థతతో ఆసుపత్రిలో చేరి ఇటీవల డిశ్చార్జ్ అయిన ఖర్గే**

**గుండె వేగం తగ్గకుండా పేస్ మేకర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన వైద్యులు**

**బెంగళూరుకు వెళ్లి ఖర్గేను పరామర్శించిన రేవంత్ రెడ్డి**



2

# రాయదుర్గంలో ఎకరం ధర రూ.177 కోట్లు!

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్‌లో భూమి రికార్డు ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరా భూమి ఏకంగా రూ.177 కోట్లకు అమ్ముడుపోయింది. టీజీఐఐసీ నిర్వహించిన వేలంపాటలో 7.67 ఎకరాల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ దక్కించుకుంది. మొత్తం రూ.1357 కోట్లతో ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ 7.67 ఎకరాల భూమిని దక్కించుకుంది. టీజీఐఐసీ చరిత్రలో ఇదే రికార్డు ధర కావడం గమనార్హం. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న 18.67 ఎకరాల భూమికి టీజీఐఐసీ సోమవారం వేలంపాట నిర్వహించింది. ఈ మొత్తం భూమిని రెండు భాగాలుగా విభజించింది. 7.67 ఎకరాలను ఒక భాగంగా, 11 ఎకరాలను మరోభాగంగా ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించింది. 11 ఎకరాలను రూ.1,556.5 కోట్లకు ప్రెస్టేజ్ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుంది. ఎకరానికి రూ.141.5 కోట్లు చొప్పున ఆ రియల్ ఎస్టేట్ కంపెనీ వేలం పాడింది. ఎకరా కనీస ధర రూ.101 కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించగా.. ఇందులో పలు సంస్థలు పాల్గొన్నాయి. 2017లో రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో నిర్వహించిన వేలం పాటలో ఎకరం ధర రూ.42.59 కోట్లు పలకగా.. 2022లో నియోపోలిస్, కోకాపేటలో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలం పాటలో ఎకరం భూమి రూ.100.75 కోట్లు పలికింది. మూడేళ్ల వ్యవధిలో హైదరాబాద్‌లో భూమి ధర 75శాతం పెరిగిందని టీజీఐఐసీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, జీసీసీలు ఏర్పాటు చేసేందుకు ఉన్న సదుపాయాల వల్ల అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, అందుకే రియాలిటీ రంగం ఊపందుకుందని టీజీఐఐసీ తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాలనలో తీసుకొచ్చిన పారదర్శకత, అభివృద్ధి వల్ల దేశంలోనే హైదరాబాద్ దూసుకెళ్తోందని పేర్కొంది. మరోవైపు, తెలంగాణ హౌజింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.







## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు..
# మాతోనే మజ్లిస్ పార్టీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉప ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ తమతోనే ఉంటుందని, తమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మజ్లిస్ తమకు ఫ్రెండ్లీ పార్టీ అని వ్యాఖ్యానించారు. కంటోన్మెంట్ మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్‌ను బీసీలకు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై కూడా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితిని బట్టి మిత్రపక్షాల అభ్యర్థులకు కూడా టిక్కెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. సీపీఎం, సీపీఐ, తెలంగాణ జనసమితి అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. డిసెంబర్ చివరి నాటికి పార్టీ పదవులన్నింటిని భర్తీ చేస్తామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పును తాము ముందుగా ఊహించిందేనని ఆయన అన్నారు. త్వరలో కామారెడ్డిలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

# ఖర్గేను పరామర్శించిన రేవంత్

బెంగళూరు, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించారు. ఖర్గే అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. బెంగళూరులోని ప్రఖ్యాత ఎం.ఎస్. రామయ్య ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందిన అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఖర్గే శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న కారణంగా, ఆయన గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు వైద్యులు పేస్ మేకర్ ఇంప్లాంట్ ప్రక్రియ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెంగళూరుకు చేరుకున్నారు. పరామర్శ అనంతరం, వారి మధ్య రాజకీయ అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సుప్రీంకోర్టులో విచారణకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

# వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన నోబెల్

మొదటి పేజీ తరువాయి...


ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలుగా పేర్కొనబడే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు తమ పరిశోధనలు గుర్తించారు.

# బీసీ రిజర్వేషన్ల జీవో రిట్ పిటిషన్ తిరస్కరణ

అంశంపై రెండు రిట్ పిటిషన్లు 8వ తేదీన హైకోర్టులో విచారణకు రానున్నాయని చెప్పారు. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ తాము ఆ విషయాన్నేమీ దాచిపెట్టలేదన్నారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందిస్తూ "ఆర్టికల్ 32 కింద మీరు ఇక్కడికెందుకు వచ్చారో మొదట సమాధానం చెప్పండి. ఆ తర్వాత మెరిట్స్ ప్రాతిపదికన మీ వాదనలు వింటాం"అని అన్నారు. అందుకు న్యాయవాది బదులిస్తూ "ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు గతంలో ఆర్టికల్ 32 కింద విచారణ చేపట్టి తీర్పులిచ్చిన సందర్భాలున్నాయి" అని పేర్కొన్నారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందిస్తూ "కేసులు డిస్మిస్ చేసిన సందర్భాలూ ఉన్నాయి" అని గుర్తుచేస్తూ "మీ ఫిర్యాదును హైకోర్టు పరిశీలించిందా? లేదా?" అని న్యాయవాదిని సూటిగా ప్రశ్నించారు. అందుకు ఆయన బదులిస్తూ హైకోర్టు ఈ కేసుల విచారణను 8వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

### హైకోర్టును ఆశ్రయించడానికి అవకాశమివ్వండి

"గతనెల 26వ తేదీన దసరా సెలవులకు ముందు చివరి పని దినమైన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేసింది. ఆ మరుసటి రోజు నుంచి కోర్టులకు సెలవులని తెలిసి ప్రభుత్వం ఆ పనిచేసింది. ఇదే అంశంపై హైకోర్టులో దాఖలైన రెండుకేసుల్లో ఉపశమనం లభించలేదు కాబట్టే మేం ఇక్కడికి వచ్చాం. గతనెల 28న కొందరు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసి న్యాయమూర్తి నివాసానికి వెళ్లి మెన్షన్ చేయడంతో సాయంత్రం 6 గంటలకు విచారణ చేపట్టారు కానీ స్టేకు నిరాకరించారు. 9వ తేదీన రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయబోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని హైకోర్టుకు వెళ్లమని చెబితే మళ్లీ సుప్రీంకోర్టుకు రావడం కష్టమవుతుంది" అని పేర్కొన్నారు. అందుకు జస్టిస్ సందీప్‌మెహతా స్పందిస్తూ "మీరు నేరుగా హైకోర్టుకే వెళ్లి ఉండాల్సింది. అదే మీకు అందుబాటులో ఉన్న పరిష్కార మార్గం" అని అన్నారు. న్యాయవాది స్పందిస్తూ రెండు పిటిషన్లున్నాయని ధర్మాసనానికి విన్నవించగా "రెండు పిటిషన్లనూ డిస్మిస్ చేస్తాం" అని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టంచేశారు. దాంతో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ ఈ కేసులు 8న హైకోర్టు ముందుకొస్తున్నందున ఇక్కడ పిటిషన్ ఉపసంహరించుకొని హైకోర్టును ఆశ్రయించడానికి అవకాశమివ్వాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ అందుకు అంగీకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం (డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్) అని ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్‌సింఘ్వీ, సిద్ధార్థదవేలు హాజరయ్యారు. వారి వాదనలు అవసరం లేకుండానే ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ ముగించింది. ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు కోర్టుకు హాజరై వాదనలు పరిశీలించారు. ఆర్టికల్ 32 ప్రకారం ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం భారత పౌరుడు నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని సవాల్ చేస్తూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. వికారాబాద్ జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మడివాల మచ్చదేవ, ఎన్.లక్ష్మయ్య, మరొకరు ఈ పిటిషన్ దాఖలు చేశారు.



## బీహార్‌లో మోగిన
# ఎన్నికల నగారా

మొదటి పేజీ తరువాయి...

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా సాగుతాయని బీహార్ ఓటర్లకు హామీ ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ తర్వాత జరుగుతున్న మొదటి అసెంబ్లీ ఎన్నిక ఇది అని, 14 లక్షల మంది కొత్త ఓటర్లతో కలిపి మొత్తం 7.43 కోట్ల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభానికి ముందు 10 రోజుల వరకు ఓటర్ల జాబితాలో దిద్దుబాట్లకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ సమాచారాన్ని ఎదుర్కోవడానికి ఈసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశీలకుడిని నియమించినట్లు చెప్పారు. 2020లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు మూడు దశల్లో జరిగాయి. ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత రాలేదు. దీంతో జేడీయూ, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. నితీశ్ కుమార్ రెండేళ్ల తర్వాత బీజేపీని వీడి ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కలిశారు. ఆ బంధం ఎక్కువ రోజులు నిలువలేదు. 2024 జనవరిలో బీజేపీతో కలిసి నితీశ్ కుమార్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అక్టోబర్ 18, 28 తేదీల్లో దీపావళి, ఛాత్ పండుగలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను సిద్ధం చేసిందని భావిస్తున్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో 1,200 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం 90,000కు పెంచింది.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు కావాలి

### అధికారులు సమన్వయము గా పని చేయాలి:
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(ప్రభాత ఉదయం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా లో మాడల్ కోడ్ పక్కాగా అమలు అయ్యేలా అధికారులు విధులను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఎన్నికల ఏర్పాట్లకు సంబందించి పోలీస్, రెవిన్యూ, ఎంపీడీఓ మొదలగు శాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ క్యాంపు కార్యాలయం నుండి గూగుల్ మీటింగ్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్బంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ. క్రిటికల్, సెన్సిటివ్ పోలీస్ స్టేషన్ లను మరొకసారి క్షేత్ర స్థాయి లో పరిశీలించి..రేపటిలోగా నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి మండలం లో తహసీల్దార్, పోలీస్,ఎంపీడీఓ అధికారులు సమన్వయముగా పని చేయాలన్నారు.మండల స్థాయి లో ఏర్పాటు చేయాలిసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల కై సరైన కార్యాలయం/ ప్రదేశాన్ని ఎంపిక చేయాలన్నారు.ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి టీం లలో విధులు నిర్వహించే అధికారులకు ఒరియేంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ ప్రక్రియ కి అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు.మాస్టర్ ట్రైనర్ ల ద్వారా ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారి కి మరోసారి ఎన్నికల నిర్వహణ పైన ఉన్న సందేహాలను నివృత్తి చేపించాలన్నారు.ఈ గూగుల్ మీటింగ్ లో అదనపు కలెక్టర్ లు,డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో లు, ఏసీపీ లు, జడ్పీ డిప్యూటీ సీఈఓ, డీపీవో, తహసీల్దార్ లు ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు కావాలి పాల్గొన్నారు.

## గవాయ్‌పై దాడి ఘటన...
# తీవ్రంగా ఖండించిన మోదీ

### సంయమనం పాటించిన సీజేఐని ప్రశంసించిన ప్రధాని
### దుశ్చర్యపై సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత ఉదయం)

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం తీవ్ర కలకలం రేగింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ పైకి ఓ వ్యక్తి బూటు విసిరేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన జస్టిస్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. వివరాల్లోకి వెళితే, సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా, న్యాయవాది దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి అనూహ్యంగా ధర్మాసనం వైపు దూసుకొచ్చాడు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పైకి తన పాదరక్షను విసిరేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకుని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆ వ్యక్తి 'సనాతన ధర్మం' గురించి నినాదాలు చేసినట్లు సమాచారం. ఈ అనూహ్య ఘటనతో విచారణకు కొద్దిసేపు అంతరాయం కలిగినా, సీజేఐ జస్టిస్ గవాయ్ ఏమాత్రం చలించలేదు. "ఇలాంటి వాటివల్ల మన ఏకాగ్రత దెబ్బతినకూడదు. మేం చలించం. ఇవి నన్ను ప్రభావితం చేయలేవు" అని వ్యాఖ్యానించి విచారణను కొనసాగించారు. ఆ తర్వాత, దాడికి యత్నించిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, ఆ విషయాన్ని విస్మరించాలని ఆయన సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. "సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రతి భారతీయుడినీ ఆగ్రహానికి గురిచేసింది. ఇలాంటి నీచమైన చర్యలకు మన సమాజంలో చోటు లేదు. ఇది తీవ్రంగా ఖండించదగింది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జస్టిస్ గవాయ్ ప్రదర్శించిన సంయమనాన్ని ప్రశంసించారు. ఇది న్యాయ విలువల పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తోందని అభినందించారు. మరోవైపు, ఈ దుశ్చర్యను సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ (స్కోరా) ఏకగ్రీవ తీర్మానంతో ఖండించింది. న్యాయవాద వృత్తికే అవమానకరమైన ఈ చర్య, న్యాయస్థానం గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.



ఖరీఫ్ సీజన్‌కు ఐకేపీ సెంటర్స్ ను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న ఏఎంసీ చైర్మన్ బంక శివరాజ్ యాదవ్

# ఐకేపీ కొనుగోలు కేంద్రంలను ఏర్పాటు చేయాలి

### జిల్లా కలెక్టర్‌ని కోరిన ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06 ( ప్రభాత ఉదయం): జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఈ ఖరీఫ్ సీజన్లో ఐకెపి సెంటర్లు రెండు (షామీర్ పేట మరియు చిటాకోడుర్ గ్రామాల)నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ని వినతి పత్రం ద్వారా కోరిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్. ఈ సందర్బంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామలో రైతులకు ఏఎంసి నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి రైతుకు అండగా ఉంటున్నామన్నారు. అదేవిధంగా కొన్ని సందర్భాల్లో ఇంటర్నేషనల్ ఎక్స్పోర్ట్ ధరలు తక్కువ ఉన్నందున ప్రైవేటు వ్యాపారస్తులు రైతులకు తక్కువ ధరలో కొనుగోలు చేయడం జరుగుతుంది అని అన్నారు . కావున రైతులకు ఇబ్బందులు రాకుండా ఈ ప్రజా ప్రభుత్వం లో రైతులకు మద్దతు ధర పొందాలనె ఉద్దేశంతో తొందరలో రెండు ఐకెపి సెంటర్లు(కొనుగోలు కేంద్రం లు) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగిందని అన్నారు. కోరిన వెంటనే జిల్లా కలెక్టర్ సానుకులంగా స్పందించి జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు లో రెండు ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేయుటకు సంబంధిత అధికారులకు చర్యలు చేపట్ట వలసిందిగా ఆదేశించారు, త్వరలోనె రైతులకు మద్దతు ధరలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీ బెన్సీ లోమ్,డిఆర్డిఓ పీడీ వసంత, ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా స్థానిక సంస్థల
# ఎన్నికల నిర్వహణకు చర్యలు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ పోలీస్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు సజావుగా జరగాలని సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06 (ప్రభాత ఉదయం):: స్థానిక సంస్థల ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతునట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం హనుమకొండ లోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై, వరంగల్, హనుమకొండ,జనగామ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా షేక్, డిసిపిలు, ఏసీపిలు, జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై పోలీస్ కమిషనర్, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీసీపీలు, జిల్లా పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈవోలు, ఆర్డీవోలు, ఏసీపిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ హనుమకొండ వరంగల్,జనగామ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. గత ఎన్నికల నిర్వహణలో అనుసరించిన విధానం, నమోదైన కేసులపై పరిశీలన చేయాలని అధికారులకు, ఏసీపిలకు కమిషనర్ సూచించారు. రూట్ లు, జోన్ల వారిగా మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టు లను, ఎస్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం తరలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చించిన అంశాలలో పోలీస్ శాఖ తరపున చేయాల్సిన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రూట్ మ్యాపులను ఎంపీడీవో లు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్ట్, ఎస్ఎస్ టి బృందాలు తనిఖీలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు నియమించు సిబ్బంది, పోలింగ్ కేంద్రాల, రూట్ ల ఏర్పాటు పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు.జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో సజావుగా ఎన్నికల నిర్వహణపై సమీక్ష చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అంత సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి సంధ్యారాణి, జడ్పీ సీఈఓ లు రవి, రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు కల్పన, లక్ష్మీ రమాకాంత్, సస్వరూప, ఆర్డిఓ ఉమారాణి, ఇతర అధికారులతో పాటు ఏసీపీలు పాల్గొన్నారు.

## ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు
# ప్రధాన పార్టీల వ్యూహరచన

### జనరల్ మహిళకు రిజర్వ్
### సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ తహతహ
### ఈసారి ఎలాగైన పాగా వేయాలనే పట్టుదలతో కాంగ్రెస్
### రేసులో తాము సైతం అంటున్న బీజేపీ
### అందరి దృష్టి జనరల్ స్థానాల పైనే
### జనరల్ స్థానాల బరిలో హేమాహేమీలు
### అందరి దృష్టి ఆ ఎంపీటీసి స్థానంపైనే




గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6(ప్రభాత ఉదయం)గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ ఎంపీపీ, జడ్పీటీసి పదవులు తమ ఖాతాలో వేసుకోవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహరచన చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ధరూర్ జడ్పీటీసి, ఎంపీపీ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో అతివల్లో ఆశావహులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో ఆయా పార్టీలు బలమైన నేతల కోసం గాలిస్తున్నాయి. ధరూర్ మండలంలో మొత్తం 14 ఎంపీటిసి స్థానాలకు గాను పాల్ చర్ల(ఎస్సీ -జనరల్), అల్వాల్ పాడు(ఎస్సీ -జనరల్), గూడెందొడ్డి(బీసి -మహిళ), గార్లపాడు (బీసి -మహిళ), ర్యాలంపాడు(బీసి -మహిళ), నెట్టెంపాడు,(బీసి -జనరల్), మన్నాపురం(బీసి -జనరల్), ఉప్పేర్ (బీసి -జనరల్), ధరూర్ -1 (జనరల్ మహిళ),ధరూర్ -2 (జనరల్ మహిళ) కేటాయించగా చింతరేవుల, భీంపురం, నీలహళ్లి ఎంపీటీసీ స్థానాలు జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. ధరూర్ ఎంపీపీ జనరల్ మహిళ కు కేటాయించడంతో ఎంపీపీ కైవసం చేసుకోవడానికి ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. ధరూర్ ఎంపీటీసి- 1,2 లతో పాటు జనరల్ మహిళకు కేటాయించగా చింతరేవుల, నీళహళ్లి ఎంపీటీసి జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసే అవకాశాలు ఉండడంతో ఆ దిశగా పావులు కదుపుతున్నారు. జనరల్ స్థానాలతో పాటు ఆయా సామాజిక వర్గాల్లో మహిళలకు కేటాయించిన స్థానాల్లో ఏదో ఒక ఎంపీటిసీ నుంచి పోటీ చేయించి ఎంపీపీ పదవి దక్కించుకోవాలని ప్రధాన పార్టీలు ప్లాన్ వేస్తున్నాయి. ఎంపీపీ పీఠంపై కన్నేసిన నేతలు ఒకరికి తెలియకుండా మరొకరు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఆయా పార్టీల నుంచి ఎంపీటిసీ అభ్యర్థులు పోటీచేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

#### జనరల్ స్థానాల పై అందరి గురి

ధరూర్ 1, ధరూర్ -2 ఎంపీటీసి స్థానాలు జనరల్ మహిళకు కేటాయించగా చింతరేవుల, నీలహళ్లి ఎంపీటీసి స్థానాలను జనరల్ కేటాయించారు. జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసే అవకాశాలు ఉండడంతో అన్ని సామాజిక వర్గాల నేతలు జనరల్ స్థానాలపై గురిపెట్టారు. ధరూర్ ఎంపిటిసి -1లో సుమారు 2,800 ఓటర్లుండగా, ధరూర్ ఎంపిటిసి -2(ఎస్సీ వాడ, జాంపల్లి గ్రామాలు)లో సుమారు 2,900 ఓటర్లున్నారు. ధరూర్ ఎంపిటిసి -1లో కుర్వ, బోయ సామాజిక వర్గాలతోపాటు ఇతర సామాజిక వర్గాల ఓటర్లుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే ధరూర్ ఎంపిటిసి -2లో ఎస్సీ వాడలో ఎస్సీ ఓటర్లు 1,600, మిగత సామాజిక వర్గాల ఓటర్లుండగా, జాంపల్లి గ్రామంలో (750)మున్నూరు కాపు సామాజిక వర్గం ఓటర్లున్నారు. నీలహళ్లి ఎంపిటిసి స్థానంలో నీలహళ్లి కొత్తపాలెం, కొత్తపాలెం తండాలుండగా నీలహళ్లి లో 1,500, కొత్తపాలెంలో 1,400, కొత్తపాలెం తండలో 200ఓటర్లుండగా, కుర్వ, బోయ, ముష్టి, ఎస్సీ సామాజిక వర్గం ఓటర్లు తీర్పును ప్రభావితం చేయనున్నారు. నీలహళ్లి జనరల్ స్థానానికి కేటాయించడంతో ఆయా పార్టీలకు చెందిన ఓ సామాజిక వర్గం నేతలు పోటీ చేసేందుకు సుముఖంగా ఉండటం విశేషం. చింతరేవుల ఎంపిటిసి పరిధిలోకి చింతరేవుల, నర్సన్ దొడ్డి, వామన్ పల్లి ,జీరబండ గ్రామాలు రానున్నాయి. చింతరేవులలో 2,400, నర్సన్ దొడ్డి 600, వామన్ పల్లి 650, జీరబండలో 120 ఓటర్లున్నారు. చింతరేవుల ఎంపిటిసి స్థానంలో బీసి సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. చింతరేవుల ఎంపీటీసి స్థానానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర పార్టీ అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం చింతరేవుల ఎంపీటీసి స్థానంపై దృష్టిసారించడంతో చింతరేవులలో రాజకీయవేడెక్కింది. ధరూర్ ఎంపీటీసి గెలిచి ఎంపీపీ పీఠం దక్కించుకోవడానికి ధరూర్ మండల కేంద్రంగా ఆయా రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

#### ధరూర్ ఎంపీపీ పీఠం పై అన్ని పార్టీల పోకస్

గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ధరూర్ ఎంపీపీ, జడ్పీటీసి స్థానాలు బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఅర్ఎస్, బీజేపీ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో గద్వాల అలంపూర్ ఎమ్మెల్యేలు బీఅర్ఎస్ పార్టీ గెలుపొందగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలుపొందినప్పటికీ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని ప్రకటించారు. నియోజకవర్గంలో తనదైన పట్టును కలిగియున్న గద్వాల ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి సొంత మండలమైన ధరూర్ లో జడ్పీటిసి, ఎంపీపీ స్థానాలతో పాటు గట్టు, గద్వాల, కేటిదొడ్డి, మల్దకల్ మండలాల స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుని తన అంగబలం నిరూపించేందుకు మరోసారి సిద్దమయ్యారు.గతంలో ధరూర్ ఎంపీపీ బీఅర్ఎస్ కైవసం చేసుకోగా రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు బీఅర్ఎస్ నేతలు సన్నాహాల సమావేశాలు నిర్వహిస్తూ ఇతర పార్టీల నేతలను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. ఇదే సమయంలో బీజేపీ ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఎలాగైనా ఎంపీపీ పదవిని సొంతం చేసుకోవాలని చూస్తోంది. బీజేపీ సైతం రేసులో తాము ఉన్నామన్న సంకేతాలను పంపుతోంది. దీంతో ధరూర్ ఎంపీపీ పీఠం తమకే దక్కుతుందని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారు ధీమ వ్యక్తం చేస్తున్నారు.



## సమాచార హక్కు చట్టంపైన
# విస్తృత అవగాహన అవసరం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06(ప్రభాత ఉదయం): సమాచార హక్కు వారోత్సవాలను జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. అక్టోబర్ 5 వ తేదీ నుండి మొదలైన సమాచార హక్కు చట్ట వారోత్సవాలలో భాగంగా అక్టోబర్ 12 వ తేదీ వరకు అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, సమాచార హక్కుచట్టం అమలుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనం మొదలగు అంశాల మీద అవగాహనను పెంచడానికి, ప్రజలకు ఈ చట్టం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ వారోత్సవాలు ఎంతగానో దోహద పడతాయన్నారు.



ఖరీఫ్ సీజన్లో జిల్లాలో ఐకేపీ సెంటర్లను ఏర్పాటు చేస్తూ జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్

## ఖరీఫ్ పంట ధాన్యం కొనుగోలుకై ఏర్పాట్లు పూర్తి

### మొత్తం 309 కేంద్రాలు
### రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు జరగాలి
### కేంద్రాలలో అన్ని వసతులు పక్కాగా ఉండాలి
### నిర్వాహకులు నిరంతరం అలర్ట్ గా ఉండాలి
### రిజిస్టర్ల నిర్వహణ పక్కగా ఉండాలి
### గత రెండు సీజన్ లో రికార్డు స్థాయి లో కొనుగోలు
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ (ప్రభాత ఉదయం): గత రెండు సీజన్ లలో రికార్డు స్థాయి లో ధాన్యం కొనుగోలు జరిగిందని ఈ సారి కూడా పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్%ఎ%అన్నారు వానాకాలం( ఖరీఫ్) పంట కొనుగోలు కు సంబందించి ఆర్డీఓ, సివిల్ సప్లై, డిఆర్డీఓ, మార్కెటింగ్, మార్కుఫెడ్, జిల్లా, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్టీఓ,గన్ని గోదాం ఇంచార్జి లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రసిడెంట్ లతో సోమవారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సంవత్సరం కి సంబందించి జిల్లా లో 2,13,978 ఎకరాల్లో వరి పంట సాగు అయ్యిందని 5,43,057 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా 2,05,057 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కి వస్తుందని అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు. సన్న రకం కి మద్దతు ధర 2389 రూపాయలు కాగా బోనస్ గా కింటల్ కి 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందని,అలాగే దొడ్డు రకం కి 2369 రూపాయల మద్దతు ధర ఉందన్నారు. దొడ్డురకం ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ 116, పాక్స్ 82 కేంద్రాలను, అలాగే సన్నరకం ధాన్యం కొనుగోలు కై 69 ఐకేపీ, 42 పాక్స్ సెంటర్ లను ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నమన్నారు ప్రతి కేంద్రం లో కొనుగోలు కి సంబందించిన రిజిస్టర్ లు,తేమ యంత్రాలు,ప్యాడి క్లీనర్లు,వేయింగ్ యంత్రాలు,టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏ రోజు వచ్చిన ధాన్యం అదే రోజు కొనుగోలు అవ్వాలని రైతులు వెయిటింగ్ చేసే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రతి కేంద్రం లో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అన్ని రిజిస్టర్ లు అప్ డేట్ గా ఉండే విధంగా మెయింటైన్ చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రదర్శించాలన్నారు. ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేసారు,తేమ శాతం ఎంత ఉంది,రైస్ మిల్ కు ఎంత ధాన్యం పంపించారు, ఎంత మంది రైతుల కు పే మెంట్ అయ్యింది మొదలగు వివరాలన్నీ ప్రతి కేంద్రం లో ఉండాలన్నారు. అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని,కోనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను నిర్వాహకులు కల్పించాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తేమ శాతం చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చేలా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.ఏ రోజుకారోజు కొనుగోలు అయిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేసి రైతుల ఖాతాలో త్వరగా నగదు జమ అయ్యేల పర్యవేక్షణ జరగాలన్నారు.అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా నిర్వాహకులు తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు.



# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6(ప్రభాత ఉదయం)రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్ సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతునాయుడు పిలుపుని చ్చారు. సోమవారం కేటిదొడ్డి, ధరూర్ మండల కేంద్రాలలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు గొప్పగా అమలు చేసిన కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజ లు కోరుకుంటున్నారని అన్నారు. రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దీనిని ఎన్ని కల్లో చూపించేలా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. రేవంత్ ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వలేకపోయిందని విమర్శించిరు. రైతులు, మహిళా రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్నారని, కొన్ని చోట్ల చెప్పులు కూడా క్యూలో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తెచ్చేలా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు.ఈ కార్యక్రమంలో చక్రధర్ రావు, వెంకటేశ్వర్ రెడ్డి, జి.రాఘవేంద్ర రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సోమశేఖర్ రెడ్డి, అల్లపాడు ప్రతాప్, చక్రిదర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చిన్నపాడు ఆంజనేయులు, మోనేష్,శేఖర్ నాయుడు, భరత్ సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్‌ను
# సన్మానించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



రాజేంద్రనగర్,అక్టోబర్06(ప్రభాత ఉదయం)మిస్టర్ ఇండియా 2025 టైటిల్ విన్నర్‌గా తెలంగాణ యువకుడు రాకేష్ ఆర్నె నిలువడం సంతోషంగా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు.ఈ మేరకు రాకేష్ ఆర్నెను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయికి,ఇప్పుడు ప్రేరణాత్మక ప్రయాణమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు రాకేష్ ఆర్నె,మిస్టర్ ఇండియా 2025 టైటిల్‌ను గెలుచుకొని రాష్ట్రానికి గర్వకారణమయ్యారని తెలిపారు.ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్ ఫినాలే గోవాలోని గోల్డెన్ క్రౌన్ రిసార్ట్లో ఇటీవల ఘనంగా నిర్వహించబడిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పోటీదారుల మధ్య రాకేష్ అద్భుత ప్రతిభతో రాణించి విజేతగా నిలిచాడన్నారు.రాకేష్ మహబూబ్‌నగర్ జిల్లా నవబ్ పేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబ యువకుడని వివరించారు.తన కఠోర శ్రమ,ఫిట్‌నెస్ సాధన,సామాజిక సేవ పట్ల ఉన్న కట్టుబాటుతో ఈ విజయాన్ని సాధించాడని ఆయన తెలిపారు.రక్షా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.రాకేష్ స్థాపించిన రక్షా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.34 సార్లు స్వయంగా రక్తదానం చేశారన్నారు.47 మంది బాల కార్మికుల రక్షణ,77 మంది వృద్ధులకు ఆశ్రయం,అనాథలు,అంధులు,వికలాంగుల కోసం ఉచిత వైద్య శిబిరాలు,పర్యావరణ,అవగాహన కార్యక్రమాలు, ఎస్‌డీజీస్ ప్రచారం,అలాగే రాకేష్ మలేషియాలో జరిగిన మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు పొందారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు టి.ప్రేమ్ గౌడ్,సోమ శ్రీనివాస్, ధనంజయ, కిషోర్,ఘట్టయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ సర్కిల్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టిన బిజెపి నాయకులు...

## అవినీతి అధికారులను
# వెంటనే తొలగించాలి

### బిజెపి మల్కాజిగిరి కో కన్వీనర్ మల్లికార్జున్

మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి (మల్కాజిగిరి నియోజక వర్గం) అక్టోబర్ 06 సోమవారం ( ప్రభాత ఉదయం ):- అల్వాల్ సర్కిల్ కార్యాలయం ముందు బిజెపి మల్కాజిగిరి కో కన్వీనర్ మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడుతున్న అల్వాల్ మున్సిపల్ అధికారులను వెంటనే తొలగించాలన్నారు. అల్వాల్ పరిధిలోని సర్వే నెంబర్ 573, 574, 575 లో ఇండ్ల నిర్మాణం లేకుండానే 80 ప్లాట్లకు ఇంటి నెంబర్లు ఏ విధంగా కేటాయించారో తెలుపాలన్నారు. అవినీతికి పాల్పడిన మున్సిపల్ అధికారులను వెంటనే తొలగించాలని అన్నారు. ప్రజావాణిలో భాగంగా అల్వాల్ సర్కిల్ పరిధిలో ఉన్న పార్కులలో ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేయాలని సర్కిల్ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించినట్లు చెప్పారు. అభివృద్ధి మాటలను గాలికి వదిలిన అధికారులు అవినీతిలో ముందంజలో ఉన్నారని ఎద్దేవా చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, బిజెపి నాయకులు కార్తీక్ గౌడ్, శ్రీధర్ రెడ్డిలతో పాటు బిజెపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా
# 95పీ ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

బుద్వేల్, అక్టోబరు 6 (ప్రభాత ఉదయం) : కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా రాజేంద్రనగర్ లోని ఏజీ కాలేజీ వరకు గతంలో ఉన్న 95పీ ఆర్టీసీ బస్సును ఈ నెల 8వ తేదీ నుంచి పునరుద్ధరించడానికి రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ క్రిష్ణారెడ్డి సన్నాహాలు చేస్తున్నారు . 2019 - 20 కరోనా సమయంలో వర్శిటీ గేట్లు మూసి క్యాంపస్ లోకి ఆర్టీసీ బస్సులు రాకుండ అప్పటి అధికారులు చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి అగిపోయిన బస్సు సర్వీసుల కారణంగా ప్రేమావతిపేట్, బవానీ కాలనీ ప్రజలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బాధ్యతలు తీసుకున్నాక తిరిగి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో బాగంగా రాజేంద్రనగర్ వ్యవసాక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ ప్రత్యేక చొరవ తీసుకుని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజరు క్రిష్ణారెడ్డిని కలసి విన్నవించుకున్నారు. అదే సమయంలో ప్రేమావతిపేట్ బస్తీ ప్రజలు కూడా ఆర్టీసీ మేనేజరు ను కలసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి మొదటగా కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల వరకు 95 పీ బస్సు సర్వీసును నడపాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 8వ తేదీన ఆర్టీసీ సర్వీసును ఆర్టీసీ ఉన్నతాధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు కలసి ప్రారంభించనున్నట్లు తెలిసింది. దీంతో ప్రేమావతిపేట్ బస్తీ వాసులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు. ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హుక్కా సెంటర్ పై దాడి చేసి నిర్వాహకుడు, వినియోగదారులను అరెస్ట్ చేసిన పోలీసులు


# హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడులు

బుద్వేల్, అక్టోబరు 6 (ప్రభాత ఉదయం) : మైలార్ దేవుపల్లి పరిధిలోని శాస్త్రీపురం లో అర్ధరాత్రి వేళలో హుక్కా సెంటర్ ను నిర్వహిస్తున్న శంషీర్ అనే వ్యక్తి తో పాటు హుక్కా పీల్చడానికి వచ్చిన ఐదుగురు యువకులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, మైలార్దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. శాస్త్రీపురం కాలనీలో శంషీర్ అనే వ్యక్తి అనుమతులు లేకుండ హుక్కా సెంటర్ ను నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు, మైలార్దేవుపల్లి పోలీసులు దాడులు చేసి శంషీర్ ను అరెస్ట్ చేశారు. హుక్కా త్రాగడానికి వచ్చిన ఐదుగురు యువకులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

# ఎవరెస్ట్‌పై భారీ మంచు తుఫాన్

### చిక్కుకున్న 1000 మంది యాత్రికులు!

న్యూఢిల్లీ: టిబెట్‌లోని ఎవరెస్ట్ పర్వతంపై ఏర్పడిన భారీ మంచు తుఫాన్‌లో పెద్దఎత్తున యాత్రికులు చిక్కుకున్నారు. సుమారు 1000 మంది వరకు పర్వతంపై ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్నారని తెలిసింది. వీరిలో 350 మందిని సహాయ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయని సమాచారం. ఒకరు మరణించినట్టు చైనా మీడియా ప్రకటించింది. మిగిలిన వారిని కూడా కాపాడేందుకు సహాయ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. తీవ్రమైన పరిస్థితుల్లో చిక్కుకున్న వారిలో మరో 200 మందితో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించింది. రక్షణ బృందాలతోపాటు స్థానికులు కూడా భారీఎత్తున పేరుకుపోయిన మంచును తొలగించేందుకు సహకరిస్తున్నట్టు తెలిపింది. మంచు తుఫాన్ దృశ్యాలు చూస్తుంటే అసాధారణంగా అనిపిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# జాగరణ్ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్,అక్టోబర్06(ప్రభాత ఉదయం)రాజేంద్రనగర్ నియోజకవర్గం, అత్తాపూర్ డివిజన్ (మారుతినగర్ కామన్)లోనీ శ్రీతుల్జా భవానిమాత ఆలయంలో నిర్వహించిన జాగరణ్ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.



## వర్షం నీటి సమస్యకు
# పరిష్కారం చూపాలి

### మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

శంషాబాద్,అక్టోబర్06(ప్రభాత ఉదయం)ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతదూరమైనా వెళ్తానని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్ 15 బిడ్జ్ కింద సర్వీస్ రోడ్డు వర్షం నీటితో ఇబ్బందిగా మారడంతో ఇరిగేషన్ అదికారులతో మాజీ మంత్రి ఫోన్లో మాట్లాడారు.రోడ్డుపై వర్షం నీళ్లు నిలిచి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అధికారులు సానకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది రాజీపేట సంజీవ,వెంకట్ రాజిరెడ్డి,ఆదిల్ అలీ,కాడమోని ప్రభాకర్,నరేందర్ తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ పీజీ, పీహెచ్ డీ కోర్సుల ప్రవేశాల దరఖాస్తు దాఖలు చేసే గడువు పెంపు

బుద్వేల్, అక్టోబరు 6 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న పీజీ, పీహెచ్ఎ కోర్సుల ప్రవేశాల కోసం దరఖాస్తు దాఖలు చేసే గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న పీజీ (రెగ్యులర్, ప్రత్యేక కోటా), పీహెచీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఉన్న దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్ సైట్ ను పరిశీలించవచ్చున్నారు.

# దేశంలో వెనుకబాటుతనానికి గురైన 500ల బ్లాకులలో నివసిస్తున్న ప్రజలకు కావల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎన్ ఐ ఎస్ డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీ నరేంద్ర కుమార్..



సదస్సు కు హాజరైన బ్లాక్ లెవెల్ ఆఫీసర్లు

బుద్వేల్, అక్టోబరు 6 (ప్రభాత ఉదయం) : దేశ వ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాకులలో ఆరోగ్యం, పోషణ, విద్య, ప్రాథమిక మౌళిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక ప్రగతి అభివృద్ధి చేయడానికి బ్లాక్ లెవల్ ఆఫీసర్లు కృషి చేయాలని నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్, రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ (ఎన్ఐర్రోపీఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్రకుమార్ లు అన్నారు. నీతి అయోగ్ సహకారంతో రాజేంద్రనగర్ లోని ఎన్ఐఆర్డీపీఆర్ లో బ్లాక్ లెవల్ ఆఫీసర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను వారు సోమవారం ప్రారంభించి ప్రసంగించారు. సోమవారం నుంచి నవం బరు 20 వరకు దేశ వ్యాప్తంగా ఉన్న తొమ్మిది శిక్షణ కేంద్రాలలో 126 శిక్షణ కార్యక్రమాల ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న ఐదు వేల మంది బ్లాక్ సాయి అధికారులు, ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోస్, బ్లాక్ ప్రముఖులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. రాజేంద్రనగర్ లో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో ఆనంద్ శేఖర్, డాక్టర్ జి.నరేంద్రకుమార్ లు మాట్లాడుతూ, గ్రామాలలో ప్రజలకు కావాల్సిన అవసరాలను గుర్తించి వాటిని వారికి చేరవేయడానికి అందుబాటులోకి తీసుకురావడానికి సూక్ష్మ స్థాయి ప్రణాళికల ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ ఆశించిన రీతిలో 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ అరుణ జయమణి, డాక్టర్ పి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608